సాక్షి
బాపట్ల

శనివారం, 7, సెప్టెంబర్, 2024

నీ బంటు నేనయ్య..

‘ఓ బొజ్జ గణపయ్య నీ బంటు నేనయ్యా.. ఉండ్రాళ్ల మీదికి నీ దండు పంపు’ అని ఆర్తిగా పిలిస్తే పలికే దైవం, ‘ముదాక రాత్త మోదకం సదా విముక్తి సాధకం / కళాధరావతంసకం విలాసి లోక రక్షకమ్’ అని నిండుగా ప్రార్థిస్తే ఇట్టే అనుగ్రహించే పార్వతీనందనుడు, సర్వగణాలకు అధిపతుడు విఘ్నేశ్వర స్వామి. శనివారం వినాయక చవితి. పిల్లా–పెద్దా అందరూ ఆనందంగా జరుపుకొనే పర్వదినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వరసిద్ధి వినాయక వ్రతానికి కావల్సిన పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన భక్తులతో బాపట్ల పండుగ శోభను సంతరించుకుంది.



న్యూస్‌రీల్

వరద తాకిడికి దెబ్బతిన్న ముక్తేశ్వరుని ఆలయం



రేపల్లె రూరల్: మండలంలోని మోర్తోటలో కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం వరదలతో తీవ్రంగా దెబ్బతింది. వరద తాకిడికి ఆలయ చుట్టూ ఉన్న గేట్లు కొట్టుకుపోవడంతో పాటు కొన్ని అక్కడే నేలకొరిగాయి. ఆలయం వెనుక వైపు నేల తీవ్రంగా కోతకు గురైంది. గతంలో కృష్ణా నదికి వరదలు ఇచ్చినా ఇంత నష్టం చేకూరలేదని, ఈ సంవత్సరం ఆలయం బాగా దెబ్బతిందని స్థానికులు, ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తడిసిపోయిన పుస్తకాలు



కొల్లూరు : విద్యార్థుల పుస్తకాలు సైతం వరద నీట మునిగి ముద్దయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రాథమిక విద్య నుంచి కళాశాల విద్య అభ్యసించే ప్రతి విద్యార్థి పుస్తకాలు తడిచిపోయాయి. ఇంటిలోని సామాగ్రితో పాటు పుస్తకాలను కూడా ఆరపెట్టుకుంటున్నారు.

వరద బాధితులకు నాసి రకం భోజనం



కొల్లూరు : ముంపు ప్రజలకు ప్రభుత్వం తరఫున పంపిణీ చేస్తున్న భోజనం దుర్వాసన వస్తోంది. ఆకలితో కడుపు నింపుకోవడానికి తీసుకున్న ప్రజలు ముద్ద నోటిలో పెట్టలేక పడేస్తున్నారు. బస్తాలకు బస్తాలు వాసన వస్తున్న భోజనం పొట్లాలను ఈపూరులంకలో ఓ చెత్త కుప్పలో పడేయడం నాణ్యత లేని భోజనం సరఫరాను బహిర్గతం చేస్తోంది.

అరకొరగా నిత్యావసరాల పంపిణీ



కొల్లూరు : వరద పీడిత ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకులు అసంపూర్తిగా అందుతున్నాయి. బియ్యం, కంది పప్పు, పంచదార, నూనెల తోపాటు ఆలు, ఉల్లిగడ్డలు సరఫరా చేయాలి. అయితే, దోనేపూడి దిగువనున్న పలు గ్రామాల్లో రేషన్ దుకాణాలకు ఉల్లి, బంగాళదుంపులు సరఫరా కాలేదు. మిగిలిన నాలుగు వస్తువులను మాత్రమే పంపిణీ చేస్తుండటంతో వరద బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పులిచింతలలో పెరిగిన నీటి ఉధృతి

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి మళ్లీ నీటి ఉధృతి స్వల్పంగా పెరిగింది. శుక్రవారం ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్లను మూడు మీటర్లు పైకెత్తి 1,11,568 క్యూసెక్కులు దిగువకు వదలుతున్నారు. ఎగువ నుంచి 70,178 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 72.72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది 173 అడుగులకు సమానం.

కన్నీటి ఖర్చులు తడిసి మోపెడు

- సమస్తం వరదార్పణం
- గృహోపకరణాలు సర్వం నీటిపాలు
- వాహనాలు నీట మునక
- వరద నీటిలోనే విద్యుత్తు మోటార్లు
- జల విధ్వంసంతో ఊహాకందని నష్టం

ఊహాకందని జల ప్రళయం కృష్ణా తీర గ్రామాల్ని కకావికలం చేసింది. లంక గ్రామాల్లో వరదకు పాడవ్వని ఇల్లు లేదు.. వస్తువు లేదు. ప్రాణాల్ని దక్కించుకున్నామన్న ఆనందం ఆవిరైంది. ఇళ్లలోని వస్తువులు సర్వం వరద నీట మునిగి, ఎందుకు పనికిరాకుండా పోయాయి. నష్టాన్ని తలచుకొని లంక గ్రామాల ప్రజలు మౌనంగా రోదిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, పంట పొలాల్లోని విద్యుత్తు మోటార్లు, ఆటోలు, కారులు, ఫ్రిజ్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, కూలర్లు, దుస్తులు, దుప్పట్లు, విద్యార్థుల పుస్తకాలు.. ఇలా ఒకటేమిటి సమస్తం వరదార్పణం అయ్యాయి. లంక గ్రామాల ప్రజల కళ్ల వెంట నీరు వరదలై పారుతోంది. – కొల్లూరు



లంక గ్రామాల్లో వరద నీటిలో మునిగిన ఆటోని మరో ఆటోకు కట్టి మరమ్మతులకు తీసుకెళుతున్న డ్రైవర్లు



ఈపూరులంకలో ఫ్రిజ్‌ను శుభ్రం చేసుకుంటున్న గృహిణి

మోటార్ల మరమ్మతులకు భారీగా ఖర్చు

కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని 26 గ్రామాల్లో సుమారు 20 వేల మందికి పైగా ప్రజలు వరద ముంపు బారిన పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇళ్లకు తిరిగొస్తున్నారు. పనికిరాకుండా పోయిన వస్తువులను తొలగించి, మిగిలిన వాటిని శుభ్రపరుచుకునే పనిలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. కృష్ణా నదికి ఉన్న పళంగా వరదలు రావడంతో పంట పొలాల్లో వేలాది సంఖ్యలో విద్యుత్తు మీటర్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. నదీ పరీవాహక గ్రామాల్లో పసుపు, కంద, అరటి, తమలపాకు, కూరగాయలు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలను మోటార్ల ఆధారంగానే రైతులు సాగు చేస్తున్నారు. వరదకు మోటార్ల నీట మునిగాయి.



సుగ్గునలంకలో వరద నీటిలో తడిసిన మోటార్

ఒక్కో దాని రిపేరుకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేల వరకు ఖర్చు అవ్వడంతో రైతులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. కొల్లూరు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో 3, 531 విద్యుత్తు మోటార్లు వరద నీట మునిగాయి. భట్టిప్రోలు, రేపల్లె మండలాలో కలుపుకుంటే వీటి సంఖ్య మరింత పెరగనుంది. ఈలెక్కన మోటర్ల మరమ్మతులకే రూ. 1.59 కోట్ల నుంచి రూ. 2.12 కోట్ల వరకు ఖర్చు అవ్వనున్నట్లు రైతులు వాపోతున్నారు.

భారీగా వాహనాలు మునక

వరద ప్రభావిత ప్రాంతాల్లో కృష్ణమ్మ ప్రవాహం ఇళ్ల పైకప్పుల నుంచి వెళ్లడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారులు, ట్రాక్టర్లు, లారీలు వంటి వాహనాలు మూలనపడ్డాయి. ఫ్రిజ్‌లు, కూలర్లు, వాషింగ్ మెషిన్‌లు, టీవీలు ముంపునకు గురయ్యాయి.



ఈపూరులంకలో వరద నీటిలో కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టి ఉంచిన బైక్

లెక్కకు అందని సంఖ్యలో వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు వరద నీటిలో మునగడంతో వాటి మరమ్మతులు లంక ప్రజలకు తలకు మించిన భారంలా మారనుంది. నీట మునిగిన ఒక్కో ద్విచక్ర వాహనం మరమ్మతుకు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇక ఆటోలు, లారీలు, కారులకు రూ. 20 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. టీవీలు, ఫ్రిజ్‌లు వంటి వాటి మరమ్మతులకు రూ. 5 వేలకు పైబడి అవుతుంది. వీటి మరమ్మతులకే రూ. 3 కోట్ల పైబడి లంక గ్రామాల ప్రజలపై అదనపు భారం పడనుంది.

33,769 హెక్టార్లలో వరికి నష్టం

3,806.40 హెక్టార్లలో దెబ్బతిన్న వాణిజ్య పంటలు



చిలుమూరులంకలో దెబ్బతిన్న పసుపు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కృష్ణానది వరద ప్రభావంతో వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో పెద్దఎత్తున వరితో పాటు వాణిజ్య పంటలు నీట మునిగి పాడయ్యాయి. వేమూరు మండలంలో 3,250 హెక్టార్లు, చుండూరులో 4,350, భట్టిప్రోలులో 1,652, అమృతలూరులో4,150, నగరంలో 1,550, నిజాంపట్నంలో 1,180, కొల్లూరులో 809 రేపల్లెలో 2,558, చెరుకుపల్లెలో 3,500 హెక్టార్లో వరి పంట దెబ్బతింది. బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల మండలంలో 5,850, కర్లపాలెంలో 2,520, పిట్టలవానిపాలెం మండలంలో 1,250 హెక్టార్లలో వరి నీట మునిగింది. మొత్తం 33,769 హెక్టార్లలో వరి పంట పాడైంది. ఉద్యాన పంటల నష్టం చూస్తే కొల్లూరు మండలంలో 804 హెక్టార్లలో అరటి, 818 హెక్టార్లలో పసుపు, కంద 440, కూరగాయలు 184, తమలపాకు 100 హెక్టార్లలో దెబ్బతింది. భట్టిప్రోలు మండలంలో 532 హెక్టార్లలో అరటి, 472 పసుపు, 348 కంద, 60 జామ, 46 హెక్టార్లలో కూరగాయల పంటలు కలిపి మొత్తం 3,806.40 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

బైక్ రిపేరుకు రూ. 10 వేలు



వరద నీరు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో నా ద్విచక్ర వాహనాన్ని సుగ్గునలంక విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద మెరక ప్రాంతానికి తరలించా. అక్కడ కూడా వరద నీరు ప్రవహించడంతో పూర్తిగా మునిగిపోయి, ఇంజన్‌లోకి నీరు చేరింది. మరమ్మతులు చేయించాలంటే తక్కువలో తక్కువ రూ. 10 వేలు ఖర్చు తప్పేలా లేదు.

– కోట సురేష్, చిలుమూరులంక, కొల్లూరు మండలం.

ఆటో ఇంజన్‌లోకి నీళ్లు



వరద నీరు చేరవనుకొన్న మెరక ప్రాంతం సైతం మునిగిపోవడంతో అక్కడ ఉంచిన నా ఆటో పూర్తిగా మునిగిపోయింది. వరద నీరు ఇంజిన్‌తో పాటు డీజిల్ ట్యాంక్‌లోకి సైతం వెళ్లడంతో మరమ్మతులు తప్పని సరైంది. ఆటోను తెనాలి మెకానిక్ వద్దకు తీసుకువెళితే రూ. 20 నుంచి రూ. 25 వేలు అవుతుందని చెప్పాడు. ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

–దాసరి భానుప్రసాద్, సుగ్గునలంక, కొల్లూరు మండలం.

మోటార్ల మునగడంతో అదనపు నష్టం



విద్యుత్తు మోటార్లు పంట పొలాల్లోనే ఉండటంతో వాటిని ఊడతీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేశాం. ఒక్కసారిగా వరద నీరు చుట్టుముట్టడంతో చేసేది లేక పొలంలో బోరుకు వదిలేయడంతో నీట మునిగిపోయింది. మోటారు తిరిగి పనిచేయాలంటే తప్పనిసరిగా వైరింగ్, బేరింగ్‌లు క్లీనింగ్ చేయించాలి. రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు దాకా అవుతుంది. పంట నష్టానికి తోడు మోటార్ల మరమ్మతులకు అదనంగా ఖర్చు చేయక తప్పదు.

–కోట నరేష్, సర్పంచి, చిలుమూరులంక, కొల్లూరు మండలం

వట్టి చేతులతో మిగిలాం



చర్చిలోకి చేర్చిన స్కూటీ నీటిలో మునిగిపోయి ఇంజన్‌లోకి ఒండ్రు మట్టి, నీరు చేరింది. మరమ్మతులు తప్పడంలేదు. ఇంటిలో ఫ్రిజ్‌లు, టీవీలు సైతం మునిగిపోయి పనికి రాకుండా పోయాయి. రిపేర్ల కోసమే రూ. 20 వేల వరకు పెట్టాల్సి వస్తోంది. ప్రభుత్వమే మరమ్మతుల అయ్యే ఖర్చులు అందజేసి ఆదుకోవాలి.

–కంభం జాన్‌రాజ్, క్రీస్తులంక, కొల్లూరు మండలం

రెక్కల కష్టం నీటిపాలు

కృష్ణానదికి వరదలు రావడంతో పరీవాహక లంక గ్రామాల రైతాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేసింది. నదీ ప్రవాహానికి పంట పొలాలు కోతకు గురయ్యాయి. సారవంతమైన లంక భూముల్లో సాగవుతున్న ఉద్యాన పూలు, పండ్లు, ఆకుకూర తోటలు నీట మునిగాయి. ఈ సీజన్‌లో భట్టిప్రోలు, కొల్లూరు మండలల్లోని లంక గ్రామాల్లో 9, 600 ఎకరాల్లో అరటి, పసుపు, కంద, తమలపాకు, మొక్కజొన్న, మల్బరీ, కొబ్బరి, జామ, మామిడి కాయ, మునగ, బొప్పాయి, కూరగాయలు, ఆకుకూరలు పండించారు. కృష్ణానదికి వచ్చిన వరదలతో పంటలు ముంపు బారిన పడి ఎందుకు పనికి రాకుండా పోయాయి. తాత్కలిక పంటలైన కూరగాయలు, పూల తోటలు నుంచి ఆదాయం లభించినప్పటికి దీర్ఘకాలిక పంటలు ముంపులో చిక్కుకుని దెబ్బ తిన్నాయి. ఒక్క కొబ్బరికి మాత్రం నష్టం వాటిల్లలేదు. కొల్లూరు మండలంలో 400, భట్టిప్రోలు మండలంలో 300ల ఎకరాలలో కొబ్బరి సాగవుతోంది. –భట్టిప్రోలు



వరద ఉధృతికి మునిగిన పసుపు పంట



దొండ తోట

నీట మునిగిన అరటి తోట



వరదలు ముంచెత్తడంతో గత్యంతరం లేని పరిస్థితిలో రేపల్లెలో తలదాచుకున్నా. వరదకు రెండు ఎకరాల్లో వేసిన అరటి పూర్తిగా నీట మునిగి ఎందుకు పనికి రాకుండా పోయింది. పెట్టుబడి రూ. 70 వేల వరకు పెట్టాను. ఇంతటి విపత్తు ఎన్నడూ చూడలేదు.

–ఎస్. రామారావు, ఓలేరు పల్లెపాలెం,భట్టిప్రోలు మండలం

సర్వం వరద పాలు



మేకలు, గొర్రెలు మేపుకుంటాను. మేతకు వెళ్లిన వాటిని కాపాడుకునే ప్రయత్నంలో ఇంట్లోని సర్వం వరద పాలయ్యాయి. గాబులో అరెకరం ధాన్యం (18) బస్తాలు ఉన్నాయి. అవి వరద నీటిలో నాలుగు రోజులు నానాయి. ఎందుకు పనికిరాని పరిస్థితి. ఎకరంన్నరలో అరటి, అర ఎకరంలో వరి సాగు చేపట్టా. ఈ వరదలు, వర్షాల ధాటికి అవి నీటి పాలయ్యాయి.

–డొక్కు వెంకట శివప్రసాద్, ఓలేరు పల్లెపాలెం,భట్టిప్రోలు మండలం

ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదు



కూలీనాలీ చేసుకుని జీవనం కొనసాగిస్తున్న నేను ఆదరువుగా ఉన్న రెండు పాడి గేదెలు మేపుతున్నా. అవి ఎటు వెళ్లాయో జాడ తెలియడం లేదు. రూ. పది వేలు పెట్టి గడ్డి పాట పాడాను. ఇంతటి విపత్కర పరిస్థితి ఎన్నడూ చూడలేదు. ఈ వరదలు అతలాకుతలం చేశాయి. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

–డొక్కు జలాచంద్రుడు, ఓలేరు పల్లెపాలెం,భట్టిప్రోలు మండలం

మహాగణపతి

- సత్తెనపల్లి శ్రీశ్రీ నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం
- రాష్ట్రంలోనే రెండో అతి పెద్దది
- నేటి నుంచి నవరాత్రుల పూజలు
- ఈనెల 15న నిమజ్జనం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణం వినాయక చవితి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పట్టణంలోని నాగార్జుననగర్‌లో ఉన్న శ్రీశ్రీ నగర్‌లో శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ గణనాథుడు కొలువుదీరనున్నాడు. ఈ సంఘం ఆధ్వర్యంలో 2010 నుంచి వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు జరుపుతున్నప్పటికీ 2020 సంవత్సరంలో మొదటి సారి ఎనిమిది అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ ఏడాది 14వ సంవత్సరం 61 అడుగుల భారీ వినాయక మట్టి విగ్రహం రూపుదిద్దుకుంది. ఈ విగ్రహం రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదిగా నిలుస్తోంది. పర్యావరణ హితానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ వినాయక విగ్రహాన్ని ఒడిశాకు చెందిన శిల్ప కళాకారులు 15 మంది గత నెల 7 నుంచి శ్రమించి తయారు చేస్తున్నారు. రసాయనాలు వినియోగించకుండా ఎండు గడ్డి, మట్టి, కొబ్బరి తాళ్లు, కర్రలతో ఏర్పాటు చేస్తున్నారు. సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో విగ్రహ నిర్మాణ పనులను చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల నాలుగు నాటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా వర్షం కారణంగా శుక్రవారం రాత్రికి పూర్తి కానుంది. ఈ విగ్రహం తయారీకి రూ.7లక్షలు అంచనా. కాగా ఇప్పటి వరకు రూ.10 లక్షల వరకు ఖర్చయిందని యువజన సంఘం అధ్యక్షుడు సాయితేజరాజు తెలిపారు. శనివారం వినాయక చవితి పర్వదినం నుంచి నవరాత్రులు పూజలు నిర్వహించి 9వ రోజు అంటే ఈనెల 15న సాయంత్రం ఐదు గంటలకు ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.



సత్తెనపల్లిలో చివరి దశకు చేరుకున్న 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం

తాను లేకున్నా ఐదుగురిలో సజీవం

- బాపట్ల జిల్లా యువకుడి అవయవ దానం
- చెన్నైలో మరణించిన కొమ్మినేనివారి పాలెం నివాసి చంద్రశేఖర్
- స్వగ్రామానికి భౌతికకాయం

జే. పంగులూరు: ఓ వ్యక్తి లేకున్నా అతని అవయవాలను మరో ఐదుగురుకి దానం చేసి వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చు. అది ఆ మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుల సహకారం, మనోధైర్యంపై ఆధారపడి ఉంటుంది. అలాంటి మనోధైర్యాన్ని ప్రదర్శించింది చెన్నైలో మరణించిన వెల్లలచెరువు చంద్రశేఖర్ భార్య కుసుమాంజలి. భర్త ప్రమాదవశాత్తు మరణించినా, మనోధైర్యాన్ని గుండెల్లో నింపుకొంది. భర్త అవయవాలను దానం చేసి, మరో ఐదుగురికి జీవితాన్ని ప్రసాదించాలని భావించి ముందుకు వచ్చింది. బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన వెల్లలచెరువు చంద్రశేఖర్ (35) చెన్నైలోని సిటీ బ్యాంకులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. గత నెల 29న పట్టణంలోని కోవెలకు వెళ్తున్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు..



చంద్రశేఖర్

వెంటనే కుటుంబ సభ్యులు అతడ్ని చెట్టినాడులోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయం కావడంతో ఐసీయూలో చేర్పించారు. అనంతరం కోమాలోకి వెళ్లిన చంద్రశేఖర్ గురువారం మరణించారు. డాక్టర్లు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అతడి అవయవాలను దానమిచ్చేందుకు కుటుంబ సభ్యులను సంప్రదించారు. చంద్రశేఖర్ భార్య కుసుమాంజలి భర్త మరణ పరిస్థితుల్లో మనోధైర్యాన్ని గుండెల్లో నింపుకొని అవయవాలను దానమిచ్చేందుకు ముందుకు వచ్చింది. చంద్రశేఖర్ అవయవాలను డాక్టర్లు సేకరించారు. మృతదేహాన్ని చెన్నై నుంచి కొమ్మినేని వారి పాలెం తీసుకొస్తున్నారని, శనివారం ఉదయానికి గ్రామానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు.





చింతర్లంకలో వరద నీటిలో తడిచిపోయిన పుస్తకాలను ఆరపెట్టుకుంటున్న విద్యార్థులు



తడికలపూడిలో వరద నీటిలోనే వస్తువులను శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

ముంపు నుంచి తేరుకుంటున్న లంకలు

కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాలు వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. ఇప్పటిదాకా పునారావాస కేంద్రాల్లో తలదాచుకున్న చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం నివాసితులు తిరిగి ఇళ్లకు చేరుతున్నారు. వరద విలయతాండవంలో చెదరిన గూడును చూసి ఘొల్లుమంటున్నారు. గుండె చిక్కబట్టుకుని ఇంటిని శుభ్రం చేసుకుంటున్నారు. ఇళ్లలో మేట వేసిన బురదను తొలగించుకుంటున్నారు. వర్షానికి తడిసిపోయిన పుస్తకాలను విద్యార్థులు ఆరబెట్టుకుంటున్నారు. అయితే, పంట పొలాలు మాత్రం చెరువులను తలపిస్తున్నాయి. పెసర్లంక కృష్ణా నది అంచున పంట పొలాల్లో ఇసుక, బుసక మేటలు వేసింది. వేలాది ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు మునకలోనే ఉన్నాయి. నీటిని బయటకు పంపడానికి రైతులు అవస్థలు పడుతూనే ఉన్నారు.

–కోనూరు / భట్టిప్రోలు



భట్టిప్రోలు మండలం పెదలంకలో ఓ ఇంటి ఆవరణలో ఒండ్రు



పెసర్లంక అరవింద వారధి గండి వద్ద కోతకు గురైన పంట పొలాలు



పెదలంక వద్ద వరదకు పాడైన పూరింటిని నిర్మించుకుంటున్న గ్రామస్తుడు



పెసర్లంక కృష్ణా నది అంచున పంట పొలాల్లో ఇసుక, బుసక మేటలు



ఈపూరులంకలో తడిచిన మొక్కజొన్న కండెల ఆరబోత



కిష్కింధపాలెం రహదారిపై ఉన్న వరద నీటిలోనే ప్రజల రాకపోకలు

చెస్‌లో అజయ్‌కు మరో గోల్డ్ మెడల్

శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో విజయం



శ్రీలంకలో జరిగిన చెస్ పోటీలలో గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అజయ్ సంతోష్

చినగంజాం: శ్రీలంకలో నిర్వహించిన కామన్‌వెల్త్ చెస్ చాంపియన్‌షిప్స్ 2024లో భారత దేశం తరఫున పాల్గొని బంగారు పతకం సాధించాడు తెలుగు తేజం పర్వతరెడ్డి అజయ్ సంతోష్. బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన సంతోష్ గత ఆగస్టులో దుబాయ్‌లో నిర్వహించిన 30వ అబుదాబీ అంతర్జాతీయ చెస్ పోటీలలో అండర్–14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి పలువురు అభినందనలు అందుకున్నాడు. మళ్లీ శ్రీలంకలో ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 5 వరకు నిర్వహించిన కామన్‌వెల్త్ చెస్ చాంపియన్‌షిప్స్ 2024 పోటీల్లో అండర్–18 ఓపెన్ విభాగంలో గోల్డ్ మెడల్, ర్యాపిడ్ విభాగంలో రజత పతకం సాధించాడు. నిర్వాహకులు అతనికి రూ.75 వేలతో పాటు షీల్డ్ అందజేశారు. అక్టోబరు 28 నుంచి నవంబరు 10 వరకు బ్రెజిల్‌లో జరిగే వరల్డ్ యూత్ చెస్ చాంపియన్‌షిప్–2024కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన అజయ్ సంతోష్‌ను తల్లిదండ్రులు పర్వతరెడ్డి మయూర్, సంధ్యారాణి, తాత పర్వతరెడ్డి కాంతారావు, ఉడుములు సాంబశివారెడ్డి, బంధువులు గ్రామపెద్దలు అభినందించారు. అతని తల్లిదండ్రులు స్వగ్రామం సోపిరాల కాగా వృత్తిరీత్యా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా పట్టణం నివాసం ఉంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విజయనిర్మల



కరపత్రాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

చీరాల రూరల్: ప్రకృతి వ్యవసాయం, సమతుల ఎరువులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎం. విజయ నిర్మల రైతులకు సూచించారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గవినివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనా పరీక్ష, సమతుల ఎరువుల యాజమాన్యంపై గ్రామ రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి పాటించాలని సూచించారు. వరి వెద బెట్టటం, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకునే అంశాల్ని వివరించారు. ఏరువాక శాస్త్రవేత్త ఉషారాణి మాట్లాడుతూ చీరాల మండలానికి అనుకూలమైన వరి వంగడాల రకాలు గురించి విపులంగా వివరించారు. బాపట్ల ఏడీఏ రత్నకుమారి మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట వాడకంపై వివరించారు. మొక్కజొన్న పంట కోసిన తరువాత వాటి మోడులను తగలబెట్టకుండా వాటిని కలియ దున్నితే భూమిలో కలసి మంచి ఎరువుగా తయారవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ భారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల్ని అందించవచ్చని సూచించారు. ఈ సదస్సులో చీరాల వ్యవసాయ శాఖాధికారి సుమతి, అన్ని గ్రామాలకు చెందిన వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మార్టూరు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన మార్టూరు సమీపంలో జరిగింది. సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అగతవరప్పాడుకు చెందిన షేక్ కాలేషావలి (40) గురువారం మార్టూరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానిక అంబేడ్కర్ కాలనీ ఎదురుగా రహదారి దాటుతున్న అతడిని చెన్నై నుంచి గుంటూరు వెళ్తున్న 12 టైర్ల లారీ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వలి అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసుల లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. కాలేషావలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఫర్ (EAPCET-2025 AP&TS). అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన, హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. సంప్ర: శ్రీదివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 73967 55801

DISTANCE EDUCATION

■ ఓపెన్ 10th, ఇంటర్ & B.A, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA లకు ఉత్తమ శిక్షణ ఇవ్వబడును. శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 7396755801

HOME TUTIONS

■ Inter/ EAPCET/ NEET / X- రెగ్యులర్, డిస్టెన్స్ బయాలజీ, జువాలజీ, బోటనీ,6th - 10th-డిప్లొమా,IIT, కెమిస్ట్రీ హోమ్ ట్యూషన్స్ చెప్పబడును. సంప్ర: 95025 47748

REAL ESTATE

■ రాజధానికి అతి చేరువలో అమరావతి పట్టణమునకు ఆనుకొని రాబోవు అవుటర్ రింగ్ రోడ్డుకు 1KM దూరంలో CRDA ఓపెన్ ప్లాట్స్ అమ్మకమునకు కలవు. సంప్ర: 8966201478

■ గుంటూరు సిటీలో 1000Sft, 2BHK 25 లక్షలు & 2000 Sft, 3BHK Duplex House 1.2 Cr & తాడేపల్లిలో 1611 Sft 3 BHK 68 లక్షలు: 9966960009

■ గుంటూరు సిటీ లిమిట్స్‌లో డెవలప్‌మెంట్స్ కొరకు స్థలములు కావలెను. కాంట్రాక్ట్ పద్ధతిలో ఇళ్ళు కట్టించి ఇవ్వబడును. స్పందమాత ఎంటర్‌ప్రైజెస్, గుంటూరు. 98850 43899

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, రాజా మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ సంప్ర: జనచైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 7382396677

FLAT FOR SALE

■ గుంటూరు, కొరిటిపాడు సాయిబాబా రోడ్ 4వ లైన్‌లో శ్రీ బార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 1150 2bhk & 1660 32bhk ప్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యూపై: 7989456509, 9542757575

■ గుంటూరు, విద్యానగర్ 3/10వ లైన్‌లో శ్రీ బార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 2800 చ॥అ॥ల 3bhk ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యూపై: 7989456509, 9542757575

■ బ్రాడీపేట 6/19 Rainbow Rich Land సూపర్‌డీలక్స్ 3 BHK 1800 Sft తూర్పు ఉత్తరం ఫ్లాట్స్ గృహ ప్రవేశమునకు సిద్ధముగా కలవు. సంప్ర: 9704139333, 9885700115

■ పత్రిక నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్ 98481 10543, 70836 09070

HOUSE FOR SALE

■ లాలాపేట మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంకు వెనుక, మేదర బజార్ నందు 95 గజాల ఉత్తరం ఫేసింగ్ G+2 కమర్షియల్ + రెసిడెన్షియల్ హౌస్ అమ్మకమునకు కలదు. ఫోన్ : 88852 04816

OLD BUILDINGS

■ పాతబిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకులషెడ్‌లు, పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర: 9703290782, 9700442419

PLOT FOR SALE

■ గుంటూరు గోరంట్ల లాంఫామ్ ఎదురు అంజలి 3వ లే అవుట్‌లో Plot No-420 అమ్మబడును. సీడ్‌క్యాపిటల్ గజాలు 100,200, 400 అమ్మదలచిన వారు సంప్రదించండి: 98664 10052.

SALE / RENT

■ For Sale or Rent.. Plug and Play, Fully furnished Commercial floor... Separate cabins with ACs, Fans, Intercom, CC tv, Internet connection., ready to occupy.. 1350 Sft, 35 Sqr Yds common area. 5/4, Arundelpet, Guntur.. (1 Cabin + 2 seats also available @10k/Month) Direct: 7997993989

FOR LEASE

■ పిడుగురాళ్ళ గంగమ్మగుడి సెంటర్, మెయిన్ రోడ్డులో గత 24 సం॥ల నుండి 25 బెడ్స్ రన్నింగ్ మెటర్నిటీ హాస్పిటల్ ఫుల్ ఎక్విప్‌మెంట్‌తో లీజుకు ఇవ్వబడును. ✆ 9440185589

TOLET

■ గుంటూరు చంద్రమౌళినగర్ 8/1 నందు 1వ అంతస్థులో 3 రూములు, హాలు విత్ ఎటాచ్డ్ బాత్ రూమ్, 2వ అంతస్థులో పెద్ద హాలు కమర్షియల్ పర్పస్‌కు బిల్డింగ్ అద్దెకు కలదు. ✆ 8465901139

■ గుంటూరు బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్, రెండు పెట్రోల్ బంక్‌ల మధ్య ఉన్న కోటక్ బ్యాంక్ పైన 1వ ఫ్లోర్‌లో-2200 Sft ఆఫీసులకు/ కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు కలదు. సెల్లార్ సౌకర్యం. 98490 94439.

SERVICES

■ సత్తెనపల్లిలో ప్రముఖ పాలిక్లినిక్ నందు డాక్టర్స్‌కి ఉచితముగా ఓ.పి క్యాబిన్స్ ఇవ్వబడును. 9246480320

BOREWELLS

■ విజయలక్ష్మీ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. సంప్ర: హరిహరమహల్ ఎదురుగా L.V.R క్లబ్ ప్రక్కన, GNT. 9866222717, 9848183887

PEST CONTROL

■ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5సం॥ గ్యారంటీ AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాస్పర్ పెస్ట్ కంట్రోల్ పట్నంబజార్, గుంటూరు. 8978672824, 9848131213

WANTED

■ గుంటూరులో ఫ్లేవర్స్ ఓషన్ ఐస్‌క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డీలర్స్ కావలెను. అర్హత, అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం: 9032575249

■ నిరుద్యోగులకు శుభవార్త. నెలకు లక్షకు పైగా సంపాదన, గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్‌ఆఫీస్‌నందు మార్కెటింగ్ సిబ్బంది& ఆఫీస్ ఇన్‌ఛార్జ్ మేడమ్ కావలెను: 8919352897

■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9030612463 (Work from Home available)

■ Wanted Girls aged 18-24 years to work as sales girls in a Jewellery Showroom, fruit market, Lalapet, Guntur: 9700311201

■ Wanted Audit Assistants / Accountants. Qua: B.Com / M.Com / MBA (Fin.) / CA / CMA Inter - SKVR & Associates, Plot No: 103, Fortune Towers, Near Manipal Hospitals, Guntur Dt. ✆ 89774 46166

■ గుంటూరులో పనిచేయుటకు ఆటో డ్రైవర్లు పార్ట్ టైం/ ఫుల్ టైం డెలివరీ బాయ్స్ ఏరియాల వారీగా కమీషన్ బేసిక్ పై లైన్ సేల్స్ మెన్ కావలెను. 90322 80008

■ గుంటూరు రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవంగల కాంటినెంటల్, చైనీస్, పిజా, బర్గర్, మాగి, అన్ని రకాల స్నాక్స్ చేయుటకు చెఫ్ మరియు అసిస్టెంట్ కావలెను. ✆ 8465901139

■ నరసరావుపేట దగ్గర, ప్రముఖ ఆక్వా కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ విభాగం నందు పనిచేయుటకు B.SC కెమిస్ట్రీ డిగ్రీ కలిగిన యువకులు కావలెను. బయోడేటా పంపవలసిన Mail Id:admin@valvin.in ఇంటర్వ్యూ తేది 10-09-2024 ✆ 96639 09856, 94414 84802

■ We are looking for(ANM or GNM) Senior Nursing Staff M & F with 2 or 3years Pediatric or ICU experience Receptionist with one year experience cont:6301115271

■ ప్రముఖ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ఎడ్యుకేషన్, MNCలో పనిచేయుటకు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన Age: 18 to 40॥ IT/Non IT Sector ఆఫీసు మరియు ఇంటినుండే పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. Applee Training Centre. 113, Brodipet, Guntur. 7013620244, 9652976113

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీతం 20K.ఫోన్: 8977639682, 8977639683

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాడ్మింటన్ ఆశాకిరణం న్యూమేర్

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక
- పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ
- చీరాల ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో ఇనుమడింపచేయడమే లక్ష్యం



షేక్ న్యూమేర్

చీరాల రూరల్: చీరాల కొత్తపేటకు చెందిన క్రీడాకారుడు షేక్ న్యూమేర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. చైనాలో జరిగే అంతర్జాతీయ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవ్వడం అతడి ప్రతిభకు అద్దం పడుతోంది. కొత్తపేటలోని వీఆర్‌ఎస్‌అండ్‌వైఆర్‌ఎన్ కళాశాల సమీపంలో నివాసముంటున్న షేక్ హుమయూన్ కబీర్‌కు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన న్యూమేర్ చిన్నతనం నుంచి బ్యాడ్మింటన్‌పై మక్కువ పెంచుకున్నాడు. ప్రస్తుతం అమరావతిలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అతడు జూనియర్ స్థాయిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. షటిల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతనెల 10 తేదీ నుంచి 13 వరకు ఢిల్లీలో సెలక్షన్స్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో న్యూమేర్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. దీంతో అధికారులు ఆంధ్రప్రదేశ్ తరఫున చైనాలో జరిగే ప్రపంచ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 13 నుంచి 27 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో బ్యాడ్మింటన్ ఎక్సలెన్స్ సెంటర్‌లో నిర్వహించనున్న క్యాంపులో పాల్గొననున్నాడు. అనంతరం ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 13 వరకు చైనాలో జరిగే అంతర్జాతీయ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. న్యూమేర్ తండ్రి ఐఎల్‌టీడీ కంపెనీలో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన కూడా స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కావడంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర టెక్నికల్ వింగ్‌లో రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు కుమారులకు షటిల్ నేర్పించారు. న్యూమేర్ అండర్–8 నుంచి షటిల్ ఆడుతూ అంచెలంచెలుగా ఎదిగాడు. మరిన్ని పోటీలలో పాల్గొని దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడాభిమానులు, క్రీడా ప్రేమికులు కోరుతున్నారు.

జూనియర్ విభాగంలో 6వ ర్యాంకు

ప్రస్తుతం న్యూమేర్ జాతీయ స్థాయిలో జూనియర్ విభాగంలో 6వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. చైనాలో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు అంతగా ఆర్థిక స్తోమతు లేదు. దాతల సాయం కోసం అతడు ఎదురు చూస్తున్నాడు. చైనా వెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడుకున్నదని, దాతలు సాయమందిస్తే దేశానికి ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొస్తానని అంటున్నాడు. గతంలో తనకు కొత్తపేటకు చెందిన కారుణ్య సేవా సమితి, సనాతన జీవన్ ట్రస్టుకు చెందిన నిర్వాహకులు సాయమందించినట్లు న్యూమేర్ చెప్పాడు.

వరుస పోటీల్లో సత్తా

ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్న న్యూమేర్ సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచాడు.

■ రాజమండ్రిలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

కోలుకునేదెన్నడో!

- పల్నాడులో అపార నష్టాన్ని మిగిల్చిన భారీ వర్షాలు
- జిల్లాలో మరమ్మతులకు గురైన 259.13 కిమీ రహదారులు
- ఇప్పటికీ పునరుద్ధరణ కాని రాకపోకలు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- 28,185 ఎకరాల్లో పంట నష్టంపై ప్రాథమిక అంచనాలు
- సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటనలో మరింత పెరుగుతున్న నష్టం

పల్నాడు రైతుల రెక్కల కష్టాన్ని వరద తుడిచిపెట్టింది. పెట్టుబడులను మట్టిపాలు చేసింది. అప్పులు తీర్చే మార్గం తెలీక కుమిలిపోతున్నారు. మరో వైపు రహదారులు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇంకొకవైపు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. సరఫరా నిలిచి గ్రామాల్లో అంధకారం నెలకొంది.



రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి వద్ద కోతకు గురైన రహదారి

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో వరద నీటికి మొత్తం 259.13 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. ఇందులో ఆర్ అండ్ బీ రోడ్లు 252.13కిమీ, పంచాయతీరాజ్ రోడ్లు ఏడు కిలో మీటర్లు ఉన్నాయి. వర్షాలకు నాలుగు రహదారులు పూర్తిగా కోతకు గురవ్వగా, 15 చోట్ల పాక్షికంగా కోతకు గురయ్యాయి. 33 చోట్ల కల్వర్టులు, చప్టాలు మరమ్మతులకు గురయ్యాయి. మూడు చోట్ల భారీ వృక్షాలు రోడ్డుపై పడటం, 42 చోట్ల నీరు రోడ్డుపై పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులకు రూ.5.8 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.79.3 కోట్లు అవసరం కానుంది. వర్షాలకు జిల్లాలో 41 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇందులో 11 పూరిళ్లు పూర్తిగా, 20 పూరిళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.

నిలిచిన రాకపోకలు

ముఖ్యంగా విజయవాడ నుంచి అమరావతికి వచ్చే ప్రధాన రహదారి వరదనీటికి కొట్టుకుపోయింది. విజయవాడ నుంచి వచ్చే బస్సులు పెదమద్దూరు వరకే తిరుగుతున్నాయి. పెదమద్దూరు నుంచి ఎండ్రాయి మీదుగా చిన్న వాహనాలు అమరావతికి రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు అమరావతి వెళ్లలేని పరిస్థితి. అమరావతి–క్రోసూరు రోడ్డు తాజా వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, రొంపిచర్ల మండలాలో పలు రహదారులు కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యాటక కేంద్రం కొండవీడు కొండకు వెళ్లే రహదారిపై భారీ బండరాళ్లు పడటంతో ఈనెల 15వ తేదీ వరకు రాకపోకలు నిలిపివేశారు. మరోవైపు కృష్ణానది వరదనీటి ముంపునకు గురైన గ్రామాలలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

పంట నష్టం నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ

జిల్లాలో మొత్తం 11,579 మంది రైతులకు చెందిన సుమారు 28,185 ఎకరాల్లో పంట ముంపునకు గురైనట్టు ప్రాథమికంగా ఇప్పటికే అంచనా వేశారు. ఇందులో 195 గ్రామాల పరిధిలో 11,052 మంది రైతులకు చెందిన సుమారు 27,012 ఎకరాల్లో వ్యవసాయ పంటలన నష్టపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందులో అత్యధికంగా 23,317 ఎకరాల్లో పత్తి పంట, 2,745 ఎకరాల్లో వరి, 627.5 ఎకరాల్లో కంది, 250 ఎకరాల్లో మినుము, 37.5 ఎకరాల్లో జూట్ పంటలకు నష్టం కలిగింది. మరోవైపు జిల్లాలో 527 మంది రైతులకు చెందిన 1,173 ఎకరాల్లో ఉద్యాన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి.

విద్యుత్ సంస్థకు రూ.64.55 లక్షల నష్టం



ప్రకాష్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్న సిబ్బంది

నరసరావుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.64.55 లక్షల నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. వీటిలో రెండు 33 కేవీ ఫీడర్లు, 11కేవీ ఫీడర్లు 16, 33 కేవీ పోల్స్ ఎనిమిది, 11 కేవీ పోల్స్ 139కు నష్టం జరిగింది. లో టెన్షన్ పోల్స్ 99 పడిపోయాయి. 2.83 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. 88 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి.